క్లుప్తంగా

మద్యం మత్తులో గొడవ


గాయాన్ని చూపుతున్న షఫీ

కొడవలూరు: మద్యం మత్తులో స్నేహితుల మధ్య గొడవ జరిగింది. మాటా మాటా పెరిగి ఒకరిపై మరొకరు మద్యం బాటిల్‌తో పొడిచిన ఘటన మండలంలోని నార్తురాజుపాళెంలో ఆదివారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గండవరానికి చెందిన షేక్.షఫీ, హఫీజ్‌లు స్నేహితులు. వీరిద్దరూ ఆదివారం నార్తురాజుపాళేనికి వచ్చి మద్యం సేవించారు. మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవగా మారింది. ఈ క్రమంలో హఫీజ్ మద్యం బాటిల్ పగులగొట్టి షఫీ కడుపులో పొడిచారు. రక్తస్రావంతో ఉన్న షఫీని 108 వాహనంలో నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కొడవలూరు పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తు చేస్తున్నారు.

8న సామూహిక వరలక్ష్మీవ్రతం



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో 8వ తేదీన ఆదిలక్ష్మీదేవికి సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు ఆదివారం తెలిపారు. వ్రతంలో పాల్గొనే భక్తులకు అమ్మవారి ప్రసాదంగా రవిక, పసుపు, కుంకుమ, గాజులను ఉభయకర్త సీతారామయ్య స్వామి అందిస్తారని వెల్లడించారు.

కండలేరులో 25.832 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 25.832 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నేత్రదానం


అంజమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని రాజీవ్‌నగర్ అరటితోట ప్రాంతానికి చెందిన సుంకర అంజమ్మ(83) శనివారం రాత్రి ఆమె నివాసంలో మృతిచెందారు. రెడ్‌క్రాస్ సొసైటీ కావలి శాఖ చైర్మన్ రవిప్రకాష్, జిల్లా సభ్యుడు శ్రీహరి సహకారంతో కుటుంబ సభ్యుడు వెంకటదయాకర్ మృతురాలు అంజమ్మ నేత్రాలను నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ ఆమె నేత్రాలను సేకరించి కుటుంబసభ్యులకు సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా టెక్నీ షియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలిచిన 99595 89321, 98498 50498, 94414 41515 నంబర్లను సంప్రదించాలని కోరారు.

టీచర్స్ క్రికెట్ లీగ్‌ను జయప్రదం చేయండి

గూడూరు రూరల్: గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 31వ తేదీ నుంచి జరిగే 6వ టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో ఆదివారం టోర్నమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 3వ వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆరేళ్లుగా ప్రతిష్టాత్మకంగా లీగ్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టోర్నీకి సంబంధించిన విధివిధానాలపై చర్చించారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీడీ కరిముల్లాఖాన్, మురళీసింగ్, షేక్ బాబర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సీనియర్ క్రీడాకారులు మునిభాస్కర్ పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ

• ఒకరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని తిరుమల పాల డెయిరీ సమీపంలో ఆదివారం రెండు మోటార్‌బైక్‌లు ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పొదలకూరు మండలానికి చెందిన గంగయ్య అనే వ్యక్తి తిరుమల పాల డెయిరీలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని బైక్‌పై కోట క్రాస్‌రోడ్డు వైపునకు వస్తున్నాడు. అదే మార్గంలో నెల్లూరు నుంచి శ్రీకాళహస్తికి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళుతున్నారు. డెయిరీ సమీపంలో వీరిద్దరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో గంగయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని స్వర్ణ టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెట్టపంటల సాగు సందేహమే..

కాలువల ద్వారా నీరందే పరిస్థితి లేదు

• జాడ లేని వర్షాలు • ఆగస్టులోనూ అధికంగా ఉష్ణోగ్రతలు

• కాలానుగుణంగా తగ్గుతున్న అపరాల సాగు

పొదలకూరు: పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సాగునీటి సౌకర్యం తక్కువగా ఉండటంతో ఖరీఫ్‌లో మెట్టపంటల సాగు లేకుండా పోయింది. పొదలకూరుతోపాటు రాపూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు మండలాలు సబ్‌డివిజన్ పరిధిలోకి వస్తాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో మనుబోలు, వెంకటాచలం వంటి మెట్ట ప్రాంతాల్లో సైతం ఖరీఫ్ పంటలు కనిపించకుండాపోయాయి. ఇందుకు ప్రధాన కారణం కాలువల ద్వారా నీరు అందకపోవడం, సకాలంలో వర్షాలు కురవకపోవడమేనని రైతులు చెబుతున్నారు. పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో రబీ సీజన్‌లో కూడా వరితో పాటు మెట్టపంటలైన మినుము, పెసర, కంది సాగు చేస్తుంటారు. అయితే ఈసారి వాటి సాగు సందేహంగా మారింది. సాధారణంగా జూలై, ఆగస్టు నెలలో కురిసే వర్షాలకు రైతులు పొలాల్లో దుక్కిదున్నకం పనులు పూర్తి చేసుకుని సెప్టెంబర్‌లో అపరాల సాగు చేపడుతుంటారు.

గణనీయంగా తగ్గుతూ..

ఖరీఫ్‌లో కాలువలకు సాగునీరు అందించడంతో ఎడగారు కింద వరి 3 వేల నుంచి 4 వేల ఎకరాల్లో సాగైయ్యేది. అయితే ప్రస్తుతం మండలంలో 3,700 ఎకరాల్లో వరి ఉంది. కండలేరులో 26 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ జలాశయానికి సోమశిల నుంచి వరద కాలువ ద్వారా నీరు చేరుకోవాలంటే మరి కొంత సమయం పడుతుంది. అయితే ఏ మేరకు నీటిని విడుదల చేస్తారనేది అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకోవాల్సింది. కండలేరులో నీటి నిల్వ పెరిగితే చుట్టుపక్కల మండలాల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది.

గతేడాది సాగు చేసిన మినుము పంట



వానల్లేక..

జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఆగస్టులో ఎండలు మండుతుండటంతో ముఖ్యంగా నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారు. స్వల్పంగా ఖరీఫ్‌లో మెట్టపంటలు సాగుచేస్తున్న అన్నదాతలు నేలలో తేమశాతం ఉండటం లేదని దుక్కిదున్నకం పనులకు కూడా ఉపయోగం లేకుండా ఉందని చెబుతున్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 54.1 మి.మీ కాగా 20 మి.మీ మాత్రమే నమోదైంది. జూలైలో 86.3 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 20.6 మి.మీ వాన కురిసింది. ఆగస్టులో 86.0 నమోదు కావాల్సి ఉంది. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో తేమశాతం కూడా ఆవిరైపోయిందంటున్నారు. కండలేరు ఎడమగట్టు కాలువ కింద సవక, జమాయిల్, దోస, మిర్చి, బీర పంటలు సాగు చేస్తున్నారు.


కాలువలు, వర్షాధారంగా సాగవుతున్న సవక పంట

మెట్టపంటలకు ఇబ్బంది



కాలువలకు నీటిని విడుదల చేసినా వర్షపాతం నమోదైతేనే మెట్టపంటలకు మేలు జరుగుతుంది. దుక్కిదున్నకాలు చేపట్టాలంటే వాన కురవాలి. ఇప్పటి వరకు ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాలేదు. ఎండలు మండిపోవడంతో ఉన్న తేమశాతం కూడా ఆవిరవుతోంది.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

ఆసక్తి చూపడం లేదు



ఖరీఫ్‌లో మెట్టపంట సాగు చేపట్టాలని సలహాలు, సూచనలు ఇస్తున్నాం. అయితే గతేడాది డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు మినుము దెబ్బతిని రైతులు నష్టపోవడంతో ఆసక్తి చూపడం లేదు. ఆగస్టులో కంది సాగు చేస్తే ఫలసాయం అందుతుంది. అయితే రైతులు తక్కువ మందే దాని సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మొత్తంగా చూసుకుంటే అపరాల సాగు తగ్గుతుందని భావిస్తున్నాం.

– కె.శివనాయక్, ఏడీఏ, పొదలకూరు

మంచి ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం


తాజా కూరగాయలు

• వ్యాధుల కాలంలో జాగ్రత్తలు తప్పనిసరి
• తాజా పండ్లు, ఆకుకూరలతో రోగ నిరోధక శక్తి

కోవూరు : ప్రస్తుత సీజన్‌లో ప్రతిఒక్కరికీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో రోగ నిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. రోజువారీ షోషకాలతో కూడిన ఆహారం శరీరానికి అవసరమైన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు.

వీటికి దూరంగా ఉండాలి

నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్‌డ్రింక్స్, ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

రోజువారీ ఆహారం ఇలా..

రోజువారీ ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ క్రమంలో ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీలీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. మధ్యాహ్న భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకుకూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలతో చిరు తిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా రెండు చపాతీలు తినాలి.

నీరు, పాలకు ప్రాధాన్యమివ్వాలి

సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవాలి. దీంతో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీలీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్నవారు రోజుకు ఒకటి, రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు. ప్రతిరోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్, రొయ్యలు వంటివి స్వల్పంగా తినాలి.

విటమిన్లు ఉండేలా చూసుకోవాలి



ఆహారం బాగా ఉడికించి తినాలి. రోజువారీ ఆహారంలో ఏ, డీ, సీ, కే విటమిన్లు ఉండేలా చూసుకోవాలి. అలా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి.

– డాక్టర్ వెంకటచలపతి గౌడ్, కోవూరు సీహెచ్‌సీ వైద్యాధికారి

సండే సందడి



ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్‌కు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కొన్నిరోజులుగా ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో సేదతీరేందుకు అధిక సంఖ్యలో విచ్చేశారు.

– తోటపల్లిగూడూరు

ఉచిత వైద్యశిబిరం

పొదలకూరు: పట్టణంలోని గాయత్రి స్కూల్లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. నెల్లూరు ఎస్‌బీటీ స్పెషాలిటీ ఆర్థోపెడిక్ సెంటర్ వైద్యులు శిబిరంలో పాల్గొని వంద మందికి మోకాళ్లు, వెన్నునొప్పులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చైతన్యకుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రబాబు పాల్గొన్నారు.


వాలీబాల్ కిట్ వితరణ



మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు యువతకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆవుల తులసీరాం సొంత నిధులతో వాలీబాల్ కిట్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలు, పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. జట్ల కొండూరులో యువత క్రికెట్, వాలీబాల్లో ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. అందుకే వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట స్కూల్ కమిటీ మెంబర్ శ్రీనివాసులు ఉన్నారు.

లారీ బోల్తా

• డ్రైవర్‌కు గాయాలు


ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

చిల్లకూరు: కర్ణాటక నుంచి నెల్లూరుకు వెళ్తున్న లారీ రైటర్‌సత్రం సమీపంలో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. లోడు లారీ శనివారం రాత్రి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి నెల్లూరుకు బయలుదేరింది. ఆదివారం వేకువ జామున మండలంలోని రైటర్‌సత్రం వద్దకు లారీ వచ్చేసరికి డ్రైవర్ కునుకు తీయడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గాయపడ్డాడు. కాగా లారీ రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విచారణ చేస్తున్నారు.

ఎడమగట్టు కాలువకు నీటి విడుదల


పంపింగ్ స్కీమ్ ద్వారా నీటి విడుదల

పొదలకూరు: కండలేరు ఎడమగట్టు కాలువకు ఎత్తిపోతల పథకం ద్వారా ఆదివారం సాగునీటిని విడుదల చేశారు. ఒక మోటార్ ద్వారా ముందుగా 110 క్యూసెక్కుల నీటిని కాలువకు పంపింగ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నిరోజులు నీటిని పంపింగ్ చేసేది రైతుల అవసరాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థి నాయకులతో సీఈఓ తదితరులు

• పోర్టు సీఈఓ జగదీష్ పటేల్

ముత్తుకూరు(పొదలకూరు): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ అన్నారు. పోర్టు నిర్వహిస్తున్న అదానీ వరల్డ్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన విద్యార్థి నాయకుల పదవీ ప్రమాణ స్వీకార వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకుడిగా ఎదగాలంటే స్కూల్, కాలేజీ సరైన వేదికని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన సతీమణి చాందినీ పటేల్‌తో కలిసి బ్యాడ్జీలను అందజేశారు. అదానీ ఫౌండేషన్ అకడమిక్ మేనేజర్ విరాజ్ మోరా మాట్లాడుతూ ఈ వేడుకలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో మైలురాయిగా నిలుస్తాయన్నారు. విద్యార్థి నాయకులు తమ పాఠశాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిందిగా సూచించారు.

ప్రాచీన కళలను కాపాడుకుందాం


తిలకిస్తున్న బాలికలు, గ్రామస్తులు


నాట్య ప్రదర్శన చేస్తున్న పూర్ణిమ

మనుబోలు: ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్సై శివరాకేష్ అన్నారు. మనుబోలు కోదండరామపురంలో ఆదివారం సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతుల ప్రభావంతో భారతీయ ప్రాచీన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. కూచిపూడి గురువు డేగల సాంబశివరావు, ఆయన శిష్యురాలు పృథ్వీ పూర్ణిమ కృషి అభినందనీయమన్నారు. అనంతరం పూర్ణిమ కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన ముళ్లపొదలు



వెంకటాచలం: మండలంలోని కందలపాడు గ్రామానికి వెళ్లే రోడ్డును ముళ్లపొదలు కమ్మేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో కందలపాడుతోపాటు పులతీగలపాడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై ఇరువైపులా ముళ్లచెట్లు ఉండటంతో రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

చాముండేశ్వరి ఆలయంలో కోలాహలం


అమ్మవారి ఆలయంలో పుష్పాలంకరణ

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. శ్రావణ మాసం నేపథ్యంలో ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూలంగిసేవ జరిపారు. ఉభయకర్తలుగా రామతీర్థానికి చెందిన తంబి రాజా– ప్రవల్లిక దంపతులు వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

నీటి హక్కులకు భంగం


మాట్లాడుతున్న మిడతల రమేష్

పొదలకూరు: కర్ణాటక రాష్ట్రం అప్పర్ భద్ర ప్రాజెక్ట్ వల్ల రెండు తెలుగు రాష్ట్రాల నీటి హక్కులకు భంగం కలుగుతుందని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ అన్నారు. పొదలకూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో ఆ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల కృష్ణా జలాలను కోల్పోతుంటే తెలంగాణ మంత్రులు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. సమావేశంలో నాయకులు ధనంజయరావు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, మూర్తిరెడ్డి పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్స్


క్వార్టర్స్ నేడిలా..


ఆవరణలో ముళ్లపొదలు

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలోని పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరింది. గతంలో సర్వేపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో పోలీస్‌స్టేషన్ ఉన్నప్పుడు క్వార్టర్స్‌లోనే కానిస్టేబుళ్లు నివాసం ఉండేవారు. అప్పట్లో స్టేషన్‌లో ఉన్న మందుగుండు సామగ్రి నిల్వలు పేలిపోవడంతో భవనం ధ్వంసమైంది. దీంతో స్టేషన్‌ను ఇరిగేషన్ కార్యాలయానికి మార్చారు. ఆ స్థలంలోనే రూ.75 లక్షలు వెచ్చించి కొత్త పోలీస్ స్టేషన్‌ను నిర్మించారు. అయితే క్వార్టర్స్‌ను గురించి ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో నాలుగేళ్ల నుంచి ఒక్కరు కూడా నివాసం ఉండటంలేదు. కనుపూరు చెరువులో ఈ క్వార్టర్స్ ఉంది. భవనాలను ఆధునికీకరణ చేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు.